క్లుప్తంగా

ఉచిత న్యాయ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్

బొబ్బిలి: న్యాయసేవ సాధికార చట్టం ద్వారా ఉచిత సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ అన్నారు. స్థానిక కోర్టు సముదాయంలో శనివారం ప్యానల్ లాయర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాసుదేవన్ న్యాయ సాధికార చట్టంలోని పలు అంశాలపై న్యాయవాదులకు వివరించారు. చట్టానికి లోబడి న్యాయ సేవలను అందించాలని కోరారు. ఉచిత న్యాయ సేవలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ, జూనియర్ సివిల్ జడ్జి రోహిణీరావు, బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగాల అధ్యక్షులు వీరే..

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. బొబ్బిలి పట్టణ యువజన విభాగం అధ్యక్షుడిగా పువ్వు చిన్నారావు, మండల అధ్యక్షుడిగా నామపు వెంకటేష్, బాడంగి మండల అధ్యక్షుడిగా వంగపండు రమేష్, రామభద్రపురం అధ్యక్షుడిగా పత్తిగుళ్ల ఏక్‌నాథ్, తెర్లాం మండల అధ్యక్షుడిగా మాదాసు వెంకటశేషగిరిలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి.

వృద్ధులపై చిన్నచూపు తగదు

రాజాం సిటీ: ప్రతి ఒక్కరికి వృద్ధాప్యం వస్తుందని, కాబట్టి వృద్ధుల పట్ల చిన్నచూపు తగదని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు అన్నారు. స్థానిక మల్లికార్జున కాలనీలో ఉన్న అనాథ వృద్ధాశ్రమంలో శనివారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో ఉన్న వృద్ధుల పట్ల ఆ కుటుంబంలోని మిగతా సభ్యులు గౌరవంతో నడుచుకోవాలన్నారు. వృద్ధులకు న్యాయసేవా పథకం ద్వారా ఉచిత న్యాయసేవలు పొందవచ్చన్నారు. ఆశ్రమంలోని వృద్ధులకు చీరలు, దుప్పట్లు, తువాళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, న్యాయవాది ఎం.శ్రీనివాసరావు, ఎస్సై వీబీ రామకృష్ణారావు, రెడ్ క్రాస్ రాజాం అధ్యక్షులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

3,550 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రేగిడి: మండలంలో అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని 25 ఆర్‌బీకేల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శనివారం నాటికి 3,550 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్ల చెప్పారు. వాటిని ఐదు మిల్లులకు తరలిస్తున్నట్లు వివరించారు.

నూతన పింఛన్ల పరిశీలన

మెంటాడ: కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు జనవరి 1 నుంచి పింఛన్ డబ్బులు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ తెలిపారు. మండలంలోని ఆంద్ర, లోతుగెడ్డ, తమ్మిరాజుపేట గ్రామాల్లో కొత్తగా పింఛన్లు మంజూరైన పింఛన్లను శనివారం పరిశీలించారు. మండలంలో కొత్తగా 2,800 పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. వాటికి సంబంధించి వెరిఫికేషన్ పూర్తి చేసి పింఛన్ల మంజూరుకు జిల్లాస్థాయి అధికారులకు నివేదిక పంపించనున్నట్లు చెప్పారు.

ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నటరాజ్, ఉపాధ్యాయులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత పెరిగిందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు పాఠశాల స్థాయి నుంచి పిల్లలు సాంకేతిక విద్యను అందిపుచ్చుకుంటున్నారన్నారు. మండలంలోని కలువరాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు శనివారం బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ బొత్స నటరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైదానాలు సిద్ధం

రాజాం: ఈనెల 26 నుంచి నిర్వహించే 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలకు మండలంలో ఏడు మైదానాలను సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ బాసూరీ శంకరరావు తెలిపారు. పొగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానాన్ని శనివారం ఆయన పరిశీలించారు. పోటీల నిర్వహణకు అనువుగా ఉన్న మైదానాలను గుర్తించి క్రీడల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు మండలం నుంచి 2548 మంది పురుషులు, 844 మంది మహిళలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి జనవరి 9 వరకు సచివాలయ స్థాయిలో పోటీలు ఉంటాయని, అనంతరం మండల, జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు, మండల కోఆర్డినేటర్ రేణుకాదేవి, ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

వైకుంఠ ఏకాదశి/ ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం వేకువజాము నుంచి భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మార్గశిర మాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని ముక్కోటి ఏకాదశి/వైకుంఠ ఏకాదశి అంటారు. ఈ రోజున వైకుంఠం ద్వారాలు తెరిచి ఉంటాయని, ఉత్తర ద్వారం నుంచి శ్రీమన్నారాయుడిని దర్శించుకోవడం ద్వారా వైకుంఠ ప్రవేశం కలుగుతుందని భక్తుల విశ్వాసం. – సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: తెర్లాంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రామభద్రపురం: బూసాయివలస వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



బాడంగి: పాల్తేరు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ..



బొబ్బిలి: సంగారపువీధి వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, కౌన్సిలర్లు



బొబ్బిలి: కలువరాయిలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు



మెంటాడ: మెంటాడలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు



రాజాం సిటీ: అంతకాపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో భక్తుల పూజలు



రాజాం: రాణావీధిలో రాజగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రేగిడి: పనసలవలసలో వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న జీఎంఆర్ కేర్ ఎండీ డాక్టర్ రాజేంద్ర



సంతకవిటి: మిర్తివలసలో పూజలందుకుంటున్న సంపత్ వేంకటేశ్వరస్వామి

ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే..

రామభద్రపురం: మండలంలో వైఎస్సార్‌సీపీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడుతో కలిసి శనివారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గ్రామాల్లోని ప్రతీ కుటుంబానికి లబ్ధి జరిగిందని, గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసిందన్నారు. సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నది ప్రజలందరి ఆకాంక్ష అని, సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ సీఎం జగన్ వెంటే ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీని విడిచి వెళ్లిన వారు పార్టీలో వారికి విలువలేదని అనడం సరికాదని, ఈ నాలుగున్నరేళ్లు పార్టీలో ఉండి ఇప్పుడు విలువ లేదనడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీని విడిచి వెళ్తే నష్టపోయేది వారేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతినిధి అప్పికొండ నిర్మల, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, సీనియర్ నాయకులు డర్రు పైడిరాజు, రౌతు తవుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

ట్రాక్ ఉమెన్ నుంచి ఎస్సైగా..



ఎం.స్వాతి

రాజాం సిటీ: ఆమె రైల్వేలో ట్రాక్ ఉమెన్ ఉద్యోగానికి ఎంపికై విధులు నిర్వహిస్తోంది. తాజాగా విడుదల చేసిన ఎస్సై పోస్టుకు ఎంపికై పలువురికి ఆదర్శంగా నిలిచింది. మండలంలోని కొఠారిపురం గ్రామానికి చెందిన మొయిల స్వాతి ఇటీవల విడుదలైన ఎస్సై ఫలితాల్లో ప్రతిభకనబరిచి ఉద్యోగం సాధించింది. ప్రభుత్వ కొలువే లక్ష్యంగా చదివిన స్వాతి ఈ ఏడాది విడుదలైన గ్రూప్–డి ఫలితాల్లో ట్రాక్‌ఉమెన్‌గా ఎంపికై జి.సిగడాం రైల్వే స్టేషన్ పరిధిలో పనిచేస్తుంది. అక్కడితో సంతృప్తి చెందకుండా ఎస్సై పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. మొదటి ప్రయత్నంలోనే లక్ష్యాన్ని చేరుకుని పలువురు యువతకు ఆదర్శంగా నిలిచింది. కర్నూల్ రేంజ్ పరిధిలో సివిల్ ఎస్సైగా ఎంపిక కావడంపట్ల ఆమె తల్లిదండ్రులు తాతంనాయుడు, సరస్వతి, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

లారీ బోల్తా

తెర్లాం: మండలంలోని రామన్న అగ్రహారం జంక్షన్ వద్ద తెర్లాం వైపు నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న లారీ శనివారం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ ఉన్నప్పటికీ వారికి ఎలాంటి గాయాలు కాలేదు. లారీలో ఉన్న సరుకును మరో లారీలో లోడ్ చేసి అక్కడ నుంచి తరలించారు.

సెమీ క్రిస్మస్ సందడి



సంతకవిటి: క్రిస్మస్ ట్రీ వద్ద చిన్నారుల సందడి

బొబ్బిలి: పట్టణంలోని సీబీఎం కాంపౌండ్‌లో చిల్డ్రన్స్ క్రిస్మస్ వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు విశ్వాసకులు, మత పెద్దల ఆధ్వర్యంలో చిన్నారులు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అలాగే మండలంలోని అలజంగిలో క్రైస్తవ సోదరులు నగర సంకీర్తన నిర్వహించారు. క్రీస్తు భక్తిగీతాలను ఆలపిస్తూ తిరువీధి చేశారు.



బొబ్బిలి: అలజంగిలో క్రీస్తు విశ్వాసకుల నగరసంకీర్తన

● **సంతకవిటి:** మండలంలోని గరికిపాడులోని వైజ్ స్కూల్ శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన క్రిస్మస్ ట్రీ పలువురని ఆకట్టుకుంది.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేయాలి



రాజాం: ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

గ్రామీణ యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీసి వారిని క్రీడల్లో ప్రోత్సహించేందుకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ నెల 26 నుంచి గ్రామ సచివాలయ స్థాయిలో ప్రారంభమయ్యే ఈ పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న యువత క్రీడల్లో పాల్గొనేలా స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: క్రీడా పోటీల నిర్వహణపై నోడల్ ఆఫీసర్లు, పీఈటీలతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు



బొబ్బిలి: ర్యాలీ నిర్వహిస్తున్న మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల సిబ్బంది, పాలకవర్గం



రాజాం సిటీ: క్రీడల నిర్వహణపై రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి సుధాకర్



మెంటాడ: మెంటాడలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



తెర్లాం: మండల కేంద్రంలో క్రీడా పోటీలపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ ఉమాలక్ష్మి



బాడంగి: మండల కేంద్రంలో ర్యాలీ చేపడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



సంతకవిటి: సంతకవిటిలో 'ఆడుదాం ఆంధ్రా' ర్యాలీలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులు

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం



లబ్ధిదారునకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

● ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం అరసాడ గ్రామంలో ఆయన పర్యటించారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కోవిడ్ కష్టకాలంలో కూడా ఏ ఒక్క పథకాన్ని నిలుపుదల చేయలేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతీ ఇంటా సంతోషాలు నిండాయన్నారు. ప్రభుత్వంపై రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూపించే దమ్ము, ధైర్యం ఎల్లోమీడియాకు లేదన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్‌లెట్స్‌ను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ పున్నాన సత్యనారాయణ, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొంతు వెంకటరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వేమిరెడ్డి సూర్యనారాయణ, తెంటు జోగినాయుడు, సర్పంచ్‌లు లచ్చుభుక్త సత్యనారాయణ, శనపతి సత్యారావు, మండల వ్యవసాయ మండలి చైర్మన్ నల్ల కృష్ణ, పార్టీ నాయకులు కరగాన రామారావు, సాసుబిల్లి బలరాంనాయుడు, లావేటి రాంబాబు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలు పూర్తిచేయాలి

బాడంగి: గృహ నిర్మాణాల ప్రగతిలో బాడంగి మండలం ముందుండాలని, ఇంజినీరింగ్ సహాయకులకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు ఆదేశించారు. మండలంలోని గూడెపువలసలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి నెలాఖరులోగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ఇంటి స్థలం, ఇల్లు కట్టుకునేందుకు మెటీరియల్, డబ్బులు ఇస్తున్నా నిర్మాణ పనుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని వారికి సూచించారు. ఏపీఎం భాగ్యలక్ష్మి, ఏఈ సత్యం, వెలుగు సీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



గూడెపువలస జగనన్న కాలనీలో హౌసింగ్ డే నిర్వహిస్తున్న అధికారులు

సంక్షిప్తంగా..

'వై ఏపీ నీడ్స్ జగన్'



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పార్టీ నాయకులు

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస గ్రామంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. మరోసారి జగనన్న ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని, ప్రజలంతా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.

వీఆర్‌ఓ వితరణ

తెర్లాం: రంగప్పవలస గ్రామంలో నిర్మిస్తున్న శివాలయానికి గ్రామ వీఆర్‌ఓ సువ్వాడ నరసింహనాయుడు రూ.18 వేలు, ఆలయ ప్రాంగణంలో నాటేందుకు వివిధ రకాల మొక్కలను వితరణ చేశారు. నగదు, మొక్కలను సర్పంచ్ శనపతి రాంబాబుకి శనివారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు తమవంతు సహకారం అందించాలని సర్పంచ్ రాంబాబు కోరారు.

నేడు కొప్పుల వెలమ వనసమారాధన

బొబ్బిలి: కొప్పులవెలమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24న కొప్పల వెలమ వనసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కర్రి సత్యనారాయణ, బలగ సాయికృష్ణ శనివారం ఒక ప్రకటన తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సామాజిక వర్గానికి చెందిన వారంతా కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు.

కల్యాణ మండపం నిర్మాణానికి హామీ

బొబ్బిలి: తెలగ కార్పొరేషన్ ద్వారా ఆ సామాజిక వర్గ ప్రజల కోసం కల్యాణ మండప నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయిస్తామని చైర్మన్ అడపా శేషు హామీ ఇచ్చినట్టు తెలగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చనమల్ల ప్రసాదరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ సమావేశంలో కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. ఆయన వెంటనే స్పందించి నిధులు కేటాయింపుపై హామీ ఇచ్చారని తెలిపారు. తెలగా సంఘ నాయకులు, సభ్యులు ఐక్యంగా ఉండాలనని పిలుపునిచ్చారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

వంగర: విద్యుత్‌శాఖ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని విజయనగరం ట్రాన్స్‌కో విభాగం ఈఈ జి.సురేష్ అన్నారు. మండలంలోని కింజంగి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు నిర్వహణ, సిబ్బంది పనితీరు, యార్డు మెంటినెన్స్ వంటి అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారులకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. లోవోల్టేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజాం డీఈఈ బి.వి.ఎస్.ఫణీంద్ర కుమార్, ఏఈ కోనూరు వినయ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

బొబ్బిలిలో కనకదుర్గమ్మ రథం

బొబ్బిలి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గామల్లేశ్వర ఆలయం నుంచి వచ్చిన అమ్మవారి రథం శనివారం బొబ్బిలి పట్టణం చేరుకుంది. అమ్మవారి రథానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వేణుగోపాల స్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. రథంలో ఉన్న అమ్మవారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బొబ్బిలిలోని అమ్మిగారి కోనేటి గట్టుపై ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయం నుంచి దత్తాత్రేయ స్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. దత్తాత్రేయ జయంతోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సామూహిక గీతాపారాయణం

రాజాం: పట్టణంలోని శ్రీవాసవీ కళ్యాణ మండపం వద్ద శనివారం సామూహిక గీతాపారాయణం నిర్వహించారు. గీతాజయంతి సందర్భంగా సేవాభారతి–విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాజాం పట్టణం, మండంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు గీతాపారాయణంలో పాల్గొన్నారు. వంద భగవద్గీత శ్లోకాలు పారాయణం చేశారు. అంతకుముందు ఎస్ఎస్ఆర్ బాలసంస్కార కేంద్రం చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. రేగిడి మండలంలో దేవుదళ గ్రామంలో గీతాశ్రమంలో గీతాజయంతి సందర్భంగా గీతా పారాయణం నిర్వహించారు.

ఘనంగా గీతాజయంతి వేడుకలు

రాజాం: పట్టణంలో సారధిరోడ్డులో ఉన్న రమణ సత్యానంద నిలయంలో శనివారం గీతాజయంతి కార్యక్రమాలు నిర్వహించారు. దేవాదాయశాఖ ఈఓ బీవీ మాధవరావు, ఆలయ అర్చకులు వాన ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయంలోని పంచదేవతా మందిరంలో హోమం, జపాలు, అర్చనలు చేశారు. శ్రీకృష్ణ భగవద్గీత కలశపూజ నిర్వహించి, భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు.

వైఎస్సార్ బీమా అందజేత

రేగిడి: మండలంలోని అప్పాపురం గ్రామానికి చెందిన బావిశెట్టి అప్పన్న ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారం మంజూరు చేసింది. తక్షణ సాయంగా రూ.10 వేలను స్థానిక సర్పంచ్ కరణం శ్రీనివాసరావు శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. మిగిలిన రూ.90 వేలును నామినీ బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి బి.ఆశాజ్యోతి, వెల్ఫేర్ అసిస్టెంట్ డి.సుప్రియ, సచివాలయ ఉద్యోగులు, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.